

# అమెరి'కలకలం' కథలు

– వంగూరి చిట్టెన్ రాజు



4

# నా ఫేసూ- నా పుస్తకమూ...

నాలుగైదేళ్ళ క్రితం భర్త ఉద్యోగ రీత్యా మా ఊరు వచ్చిన ఒక అమ్మాయి ఉండేది. మా ఊళ్ళో ఉన్నన్నాళ్ళూ ఆ దంపతులు పాటలు పాడీ, నాటకాలు వేసీ, పిల్లల చేత నృత్యాలు చేయించీ నానా "సాంస్కృతిక హడావుడీ" చేసి మంచి పేరు తెచ్చుకున్నారు. ఇప్పుడు, ఉద్యోగ రీత్యానే అక్కడెక్కడో అట్టడుగు దేశంలో..అంటే ఆస్ట్రేలియా, న్యూజీలాండ్ ప్రాంతాలలో ఉంటున్నా....ఆ అమ్మాయి అప్పుడప్పుడు ఈ మెయిల్ లో నన్ను పలకరిస్తూ ఉంటుంది. ముఖ్యంగా ఏప్రిల్ లో వచ్చే నా పుట్టిన రోజుని జ్ఞాపకం పెట్టుకుని గ్రీటింగ్స్ పంపించేది ఈ యావత్ భూప్రపంచంలోనూ ఆ అమ్మాయి మాత్రమే! అదేం విచిత్రమో కానీ, నేను పుట్టినట్టే చాలా మందికి తెలియదు. తెలిసినా పబ్లిగ్గా ఒప్పుకోరు. అదీ రాజా వారి మహర్జాతకం.

రెండు, మూడేళ్ళ క్రితం ఒక సారి ఆ శుభాకాంక్షలతో పాటు "మీరు ఫేస్ బుక్" లో చేరండీ....అదరగొట్టేస్తారు...." అని ఒక ఉచిత సలహా కూడా ఆ అమ్మాయి ఇచ్చింది కానీ నా ముఖారవిందానికి బాపు గారు, చంద్ర గారి లాంటి వారు వేసి ఇచ్చి అదరగొట్టేసిన నా "కార్టూన్ మొహాలు" ఈ జన్మకి చాలులే, ఈ ఫేసులూ, బుక్కులూ మనకెందుకులే అని నేను ఆ సంగతి అప్పుడు పట్టించుకో లేదు. కానీ...ఇప్పుడు మేము తలపెట్టిన మొట్టమొదటి యువతరం సాహిత్య సమ్మేళనం లో పాల్గొనడానికి యువతీ యువకులు ఎక్కడ దాక్కుంటారా అని వెతకడం మొదలు పెట్టాను. నా చిన్న సైజు పరిశోధనలో చాలా మంది "యూతులు" మహేష్ బాబు సినిమాకి మొదటి రోజు ఆటలో అగరొత్తులతో హారతి పడుతూనూ, సమంతా సినిమాకి సెంటు రాసుకుని వెళ్తూనూ, బ్లాగ్ ప్రపంచంలో మునిగి పోయి వాళ్ళ పడక గదుల్లో "ల్యాపుటాపు" లతో ఆడుకుంటూనూ ఉన్నారు అని గ్రహించగలిగాను. కానీ, వాళ్ళని ఎలా "చేరుకోవాలీ", ఈ సాహిత్య సమ్మేళనం గురించి ఎలా తెలియజెప్పాలీ అని ఆలోచిస్తూ..లోచిస్తూ ఉండగా...ఈ అడుగు దేశాలలో ఉన్న అమ్మడు అప్పుడెప్పుడో ఫేస్ బుక్ గురించి పంపించిన మెయిల్ గుర్తుకొచ్చింది. వెంటనే రెండు

పదుల వయసు ఉన్న అమెరికా పౌరుడైన మా అబ్బాయిని పిలిచి "ఒరేయ్ ,, ఈ ఫేస్ బుక్ అంటే ఏమిటీ" అని అడిగాను. నేను ఎప్పుడైనా ప్రగాఢమైన నిర్ణయాలు తీసుకున్నప్పుడు మన్మోహన్ సింగ్ గారు ఒబామా ని సంప్రదించినట్టుగా, మా "అమెరికా అబ్బాయి పండు" ని సలహా అడుగుతూ ఉంటాను. వాడు ఒక వికటాట్టహాసం చేసి "ఓ...ఫేస్ బుక్....దటిజ్ ఓన్లీ ఫర్ టీనేజ్ కిడ్స్ టు టాక్ నాన్సెన్స్ 24/7...నువ్వెప్పుడూ మాట్లాడేది అదే కాబట్టి గో ఫర్ ఇట్..యు కెన్ అల్సో గో ఫర్ ట్విట్టర్." అని నన్ను ప్రోత్సహించాడు. "ట్విట్టర్" అనగానే ఆ మాట అర్ధంకాక, భయం వేసి...నాకు అర్ధం అయిన "ముఖ పుస్తకం" సంగతి చూద్దాం అనుకున్నాను.

వెంటనే నేను సా సొంత ఫేస్ బుక్ అకౌంట్ లో నమోదు చేసుకున్నాను. అప్పుడు రాత్రి పన్నెండు గంటల ఐదు నిముషాలయింది. మొట్టమొదటగా నన్ను ఆ ముఖ పుస్తకం వారు....నువ్వెవడివో ప్రపంచంలో అందరికీ తెలియడానికి అర్జంటుగా నీ ఫొటో ఒకటి ఫలానా విధంగా, ఫలానా చోట "ఎక్కించు" ....వారి పరిభాషలో అప్ లోడ్...చెయ్యమని బతిమాలారు. అంత రిస్క్ తీసుకోవడం ఎందుకులే, కొంచెం అయిన డేమేజ్ కంట్రోల్ అవుతుందేమో అనుకుని "పోనీ మనిద్దరం ఉన్న ఫొటో ఒకటి ఇందులో పెట్టనా?" అని అప్పుడే అర్ధరాత్రి వర్క్ కి పోబోతూ నా కిచ్చే బహుమతి...అనగా టెంకి జెల్ల ఇవ్వడానికి నా దరిదాపులకి వచ్చిన మా క్వీన్ విక్టోరియాని ఏదో యాదాలాపంగా అడిగాను. అప్పుడు నా మాడు భాగానికి...అనగా తలకాయ వెనక భాగానికి మామూలు కంటే ఎక్కువ డేమీజీ జరిగింది అని చెప్పకనే చెప్పుచుంటిని. పైగా" నా ఫొటో ఎక్కడైనా ఇంటర్ నెట్ లో పెట్టావో.... చంపేస్తాను, ఐ విల్ కిల్ యూ, మార్ జాయెగా,  జావూంగీ, మర్డర్ కరేగా, కరూంగీ" అని నాలుగైదు భాషలలో క్వీన్ విక్టోరియా తన చూపుడు వేలుని నాకేసి చూపించి ఆడించింది మా క్వీన్ విక్టోరియా. ఆ వేలూ మరియు దాని ఊపుడు పవరూ నాకే కాదు, పెళ్ళి చేసుకున్న ప్రతీ మగ పురుగుకీ...సారీ...పుంగవుడికీ బాగా తెలుసును. ఆ సీన్ అప్పుడప్పుడు కలలోకి వచ్చినప్పుడు  నేను చెమట్లు కక్కుకుంటూ, పక్క మీదనుంచి కిందకి పడిపోయి "కెవ్వు కేకలు" పెట్టిన సందర్భాలూ ఉన్నాయి.

మొత్తానికి ధైర్యం చేసి, నేనూ, మా క్వీన్ విక్టోరియా ఒకానొక "వీక్ మొమెంట్" లో తీయించుకున్న ఫొటోని వెతికి, అందులో ఆవిడ అందమైన పార్ట్ కట్ చేసేసి, కేవలం నా "వెల వెల బోతున్న" ముఖారవిందం మాత్రమే ఉన్న ఫొటోని ఫేస్ బుక్ లోకి "ఎక్కించాను"..అనగా "అప్ లోడ్"  చేశాను. నాకు ఈ మధ్యనే తెలిసింది అప్ లోడ్ అంటే అవతలి వాడికి ఎక్కించి ఏడిపించడం, డౌన్ లోడ్ అంటే మన కంప్యూటర్ లోకి దింపుకోవడం ఏడవడం అని అర్ధంట. సరిగ్గా అక్షరాలా పది సదరు ఫేస్ బుక్ వారు ఐదారు వందల మంది నాటీ స్నేహంగా ఉమ్మాదల్చుకున్నారోచ్ అని వారందరి వివరాలూ నాకు పంపించారు. నేనంటే "ఇది" ఉన్నవాళ్ళు ఇంతమంది ఉన్నారా అని నేను కాలర్ ఎత్తుకుంటూ ఉండగా, పది ఈ మెయిళ్ళు "టింగ్, టింగ్" అని మ్యూజిక్ కొట్టుకుంటూ నా కంప్యూటర్ లోకి వచ్చి కూచున్నాయి. వాటిల్లో ఎనిమిది "ఐ లైక్ ఇట్" అని నన్నో, నా ఫొటోనో తెలియకుండా పొగిడినవి అయితే ఒకటి మటుకు "రాజురాణీ" నుంచి వచ్చింది. "అదేమిటీ మీ ఫొటో నిలువుగా ఉంది? నేను మిమ్మల్ని నెల్లూరు సభలో చూసినప్పుడు అడ్డంగా

ఉన్నారూ? ఎవరైనా కాస్త చేతి వాటం చూపించి మీ మొహం కొలతలు మార్చేశారా?" అని ఆ మైల్ సారాంశం. ఇక్కడ నాకు వచ్చిన ప్రధాన సమస్య నా మొహం కొలతల గురించి కానే కాదు. అసలు ఈ "రాజురాణీ" అనే మనిషి రాజు అనే పేరు గల మగ వెధవా, రాణీ అనే పేరు గల అందమైన అమ్మాయా, లేదా సాక్షాత్తూ అలాంటి పేరుతో సినిమాలలో ఐటమ్స్ డాన్స్ లు చేసే "బొడ్డు సుందరి" బాపతా అనేదే నా ప్రధాన సమస్య. ఎందుకంటే, లింగ నిర్ధారణ సరిగ్గా జరిగితేనే కానీ ఆ ప్రశ్నకి తగ్గట్టుగా సమాధానం చెప్పలేం కదా! ఇలాటి అర్ధనారీశ్వరుల కేసులు నాకు చాలానే తెలుసు. వివరాలు తెలియకుండా అవాకులూ, చెవాకులతో సమాధానం ఇచ్చి చచ్చినచో చావు తప్పదు అని నాకు ఇది వరలో ఐశ్వర్యా రాయ్ లాంటి వారితో ఈ మెయిల్ లో "మాట్లాడి" వైరస్ లతో పురుగుల వాత పడి, చావు తప్పి కన్ను లొట్టబోయిన అనుభవం నేర్పింది.

ఇంతల్లోకే వచ్చిన తొమ్మిదో మెయిల్ లో "మీ కుడిపక్కన రెండు సెంటీ మీటర్ల దూరంలో ఎవరిదో రింగు రింగుల జుట్టు కనపడతోంది...అది మా క్వీన్ విక్టోరియా గారిదా? మీ తాలూకు కాదు కాబట్టి ఆ జులపాలు బహు అందముగా ఉన్నవి. ఏది ఏమైనా మీతో స్నేహం చేద్దామని మహా కోరికగా ఉంది" అని దాని సారాంశం. "ఓరి నాయనోయ్. ఇదెక్కడి గోడవరా?" అనుకుంటూ చూడగా ఆ ఈ మెయిల్ సాక్షాత్తూ వైయెస్సార్ గారి దగ్గర నుంచే అని గమనించి హడిలి చచ్చిపోయాను....ఎందుకంటే చనిపోయిన ఆయన నా స్నేహం కోరుకుంటున్నాడు అనుకుంటే, మనకి కూడా పిలుపు వచ్చేసిందా అని అనుమానం వచ్చేసింది. తీరా ఈ ముఖ పుస్తకం లో అప్పటికే అరగంట లో నాకు స్నేహితులై పోయిన మూడు వందల మంది "ఎక్కించిన" ఫొటోలు చూస్తే అందులో కరీనా కపూర్లూ, కత్రినాలూ, నాయుడు గారూ, లెక్కలేనన్ని వైయస్సార్లూ, అరడజను వినాయకులూ, ఏసు ప్రభువులూ ...ఇలా చాలా మందే ఉన్నారు.

ఆ తరవాత వచ్చిన మూడు ఈ మెయిళ్ళలో రెండు నన్ను మహదానందపరిస్తే. మూడోది భయపెట్టేసింది. మొదటి దాంట్లో ఈ "రాజురాణీ" అనే వ్యక్తి అప్పుడే నా నిలువు కొలతలని అడ్డ కొలతలుగా మార్చేసి "ఈ అడ్డమైన ఫొటో అప్ లోడ్ చెయ్యండి" అని నన్ను కోరడం, ఈ కొత్త ఫొటోలో మా క్వీన్ విక్టోరియా రింగుల జుట్టు ఎక్కడా లేక పోవడం నాకు మహదానందాన్ని కలిగించాయి. రెండో మైల్....నేను ఈ ముఖ పుస్తకంలో చేరిన పదిహేను నిముషాలలో...."ఇన్నాళ్ళకి మీకు నా మాట వినాలని బుర్రలో పడిందదన్న మాట...గుడ్ బోయ్....ఇంక ప్రపంచం అంతా మీ సొంత సుత్తే. అది వినడానికి మేమంతా రెడీగా ఉన్నాం." అని ఆ అట్టడుగు దేశాలలో ఉన్న అలనాటి స్నేహితురాలి నుంచి టింగ్ మని ఈ మెయిల్ వచ్చేసి...మళ్ళీ చాలా కాలం తర్వాత మేమిద్దరం కనెక్ట్ అయిపోయాం! ఆ తరువాత చిరకాల స్నేహితులు కొంత మంది కూడా అలాగే ఇప్పుడు కనెక్ట్ అవడం నాకు సంతోషమే కలిగించింది. మూడో మైల్ లో ఒక కుర్రాడు..బహుశా ఆకతాయి కుర్రాడే అయి తీరాలి మరి "సార్. మీరు చాలా అందంగా ఉన్నారు. ఐ లవ్యూ" అనుకుంటూ అటు మైల్ లోనూ, ఇటు చాట్ లోనూ తన ప్రగాఢమైన "ప్రేమ" ని తెలియపరచగానే...హడిలి పోయి నేను వచ్చే నెల

మళ్ళీ హైదరాబాద్ వెళ్ళినప్పుడు కర్పూరం దండలూ, మంగళ సూత్రాలూ పట్టుకుని విమానాశ్రయానికి వచ్చేస్తాడేమో అని వెంటనే నా లిస్ట్ లోంచి తీసి పారేశాను. అలాంటి మెసేజ్ లు మళ్ళీ ముట్టుకుంటే ఒట్టు!

ఇక మరొక గంటలో నా కంప్యూటర్ లో ఒక ప్రధానమైన మార్పు చోటు చేసుకుంది. అదేమిటంటే....ఇది వరకు పదేసి నిముషాలకి ఒకసారి టింగ్ మని గంట కొట్టడం మానేసి, నాకు వందల కొద్దీ ఈ మెయిల్స్ వస్తున్నాయని చెప్పడానికి ఎక్కడా ఆగకుండా ఒకే రాగంలో నా కంప్యూటర్ ఏకంగా వీణ వాయించడం మొదలు పెట్టింది. ఇక నాకు వచ్చిన న్యూస్ ఫీడ్ చూడడానికే భయం వేస్తోంది. నిజానికి ఈ ఫేస్ బుక్ స్నేహితులందరితోటీ మాట్లాడుకోవడానికి అనె అనుకుని, సాహిత్యం స్నేహితుల సాన్నిహిత్యం కోసం ఇందులో చేరాను. కానీ, నా అలాగే ఇతర కారణాలకి కూడా వాడుకోవచ్చునని ఈ న్యూస్ ఫీడ్ లో తెలిసింది. ఉదాహరణకి "నేను మొన్న ఈవెనింగ్ వాక్ చేస్తున్నప్పుడు మా ఉప్పుటేరు గట్టు మీద చేపలు గిల గిలా తన్నుకుంటున్నాయి. కొన్ని చచ్చి పోయాయి. ఈ కాలుష్యానికి కారకులెవరు? మీకు తెలుసా? " అని నన్ను అడుగుతూ వచ్చిన ఫీడ్ ఒక రకం. ఇక ఇంట్లో పూజ ఫొటోలూ, బయట కాజాలు తింటున్నప్పటి చిన్నప్పటి ఫొటోలు, ఒకటేమిటి కొన్ని వందల అంశాల మీద అభిప్రాయాలూ, ప్రశ్నలూ, ఏక వాక్య సమాధానాలూ...ఒకటేమిటీ.... టైమ్ ఉండాలే కానీ...కొన్ని పండగే పండగ....చాలా మటుకు దండగే, దండగ. ఇప్పుడు నాకు తెలియనిదల్లా ఏమిటంటే....నేను ఎవరికైనా ఈ "ముఖ పుస్తకం" వాడి ఈ మెయిల్ కొడితే ప్రపంచంలో అందరి టైమ్ లైన్ లోకీ వెళ్ళి వాళ్ళ ప్రాణాలు తీస్తుందా..లేక నాకు వస్తున్నట్టుగా కొన్ని టైమ్ లైన్ లోనూ, కొన్ని వందల పోస్టింగ్ లు న్యూస్ ఫీడ్ లో కనపడుతుందా...అనే విషయాల మీద కూలంకషంగా పరిశోధన మొదలు పెట్టాను. ఇవన్నీ నాకు సరి కొత్త పదాలు.

అన్నింటి కన్నా "ఐరనీ" ఏమిటంటే....మేము ఏప్రిల్ మొదటి వారం లో నిర్వహించదల్చుకున్న "మొట్ట మొదటి యువతరం సాహిత్య సమ్మేళనం" ఇప్పుడు వాయిదా పడింది. ఎందుకంటే, అది అన్ని కళాశాలలోనూ, విశ్వవిద్యాలయాలలోనూ పరీక్షల సమయంట. అందుచేత ఈ యువతరం సమ్మేళనాన్ని వాయిదా వెయ్యమని మమ్మల్ని చాలా మంది ప్రొఫెసర్లు అడిగారు. వారి కోరిక మేరకు బహుశా రాబోయే అక్టోబర్-డిశంబర్ రోజులలో ఈ సమ్మేళనం రూపు దిద్దుకుంటుంది.

ముందే చప్పినట్టు యువతరం సాహితీవేత్తలని "చేరుకోవడం" కోసం నేను నమోదు చేసుకున్న ఈ "ఫేసూ-పుస్తకమూ" ప్రక్రియ లో ఎరక్కపోయి ఇరుక్కుపోయాను. చూద్దాం....ఏమవుతుందో!

(ఈ కథలో కల్పితం - నిజం సగం, సగం)

మా బ్లాగ్: www.vangurifoundation.blogspot.com

COMMENTS